Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు చేయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 237 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :237 | ఆదివారం 24 ఆగస్టు 2025 | వెల : 3 | పేజీలు : 4

# తెలుగు సెంటిమెంట్ పండుతుందా?

- రైతులను ఆదుకునే పక్షానికే తాము ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతి ఇస్తామని బీఆర్ఎస్
- ఇండియా కూటమి అభ్యర్థి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తెలుగువాడైన జస్టిస్ సుదర్శన రెడ్డిని గెలిపించుకోవడానికి తెలుగు రాష్ట్రాల ఎంపీలు అందరూ కలిసి రావాలని కూడా ఆయన కోరారు.
- గతంలో పీవీ నరసింహారావు ప్రధాని అయినప్పుడు ఆయన లోక్ సభకు ఎన్నిక అవ్వడానికి అప్పటి టీడీపీ అధినేత ఎన్టీ రామారావు మద్దతిచ్చిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేస్తున్నారు.



ఏచిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్

మోకాలికి... బోడిగుండుకు ముడిపెట్టడం అంటే ఇదే. రెండు లక్షల టన్నుల యూరియా సరఫరా చేసి రైతులను ఆదుకునే పక్షానికే తాము ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతి ఇస్తామని బీఆర్ఎస్ చెప్పడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఆమల్లోకి రావాలంటే కాంగ్రెస్ అధ్వర్యంలో ఇండియా కూటమి అభ్యర్థి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారు. తెలుగువాడైన జస్టిస్ సుదర్శన రెడ్డిని గెలిపించుకోవడానికి తెలుగు రాష్ట్రాల ఎంపీలు అందరూ కలిసి రావాలని కూడా ఆయన కోరారు. గతంలో పీవీ నరసింహారావు ప్రధాని అయినప్పుడు ఆయన లోక్ సభకు ఎన్నిక అవ్వడానికి అప్పటి టీడీపీ అధినేత ఎన్టీ రామారావు మద్దతిచ్చిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేస్తున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో సెంటిమెంట్ రాజకీయాలు పనిచేసే అవకాశం తక్కువే. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు కూడా అనుకూలంగా లేవు. కాగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అప్పాయింట్‌మెంట్ ఇస్తే తాను కలిసి మద్దతు కోరతానని రేవంత్ రెడ్డి అంటే, కాంగ్రెస్ ఒక చిల్లరపార్టీ అని, రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన అభ్యర్థికి మద్దతిచ్చే ప్రసక్తి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ తేల్చేశారు. మరో వైపు తాము బీఆర్ఎస్ మద్దతు కోరలేదని కేంద్ర మంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్‌తో సంబంధాలు పెట్టుకోవడానికి బీజేపీ ఇష్టపడడం లేదన్నమాట. తెలంగాణలో సొంతంగా అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్న నేపథ్యంలో బీజేపీ ఉపరాష్ట్రపతి ఎన్నిక విషయంలో కేసీఆర్‌ను సంప్రదించలేదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు జస్టిస్ సుదర్శనరెడ్డి.. టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో తనకు సత్సంబధాలు ఉన్నట్టుగా మాట్లాడడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బీఆర్ఎస్ తెలంగాణకు చెందిన పార్టీ. ఆ రాష్ట్రానికే చెందిన ప్రముఖుడు ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేస్తున్నప్పుడు ఆయనకు మద్దతివ్వడం ఒక నైతిక బాధ్యత. జస్టిస్ సుదర్శనరెడ్డి పట్ల వీరికి వ్యతిరేకత కూడా ఉండదు కానీ ఆయన కాంగ్రెస్ కూటమి పక్షాన పోటీలో ఉండడం ఇబ్బంది అవుతుంది. ఎందుకంటే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామే అన్నట్టుగా బీఆర్ఎస్ పోటీపడుతోంది. అలాంటి సమయంలో రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన అభ్యర్థికి మద్దతు ఇస్తే, కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు అయ్యాయన్న బీజేపీ - మిగతా3లో



## ఏపీ ఆర్థిక పరిస్థితిపై వైఎస్ జగన్ ఆందోళన

- 'రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలు భారీగా తగ్గి, అప్పులు పెరిగి పోతున్నాయి
- కూటమి ప్రభుత్వ విధానాలతోనే ఈ పరిస్థితి ఏర్పడింది
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి
- 2019-24 మధ్య మా ప్రభుత్వంపై టీడీపీ, జనసేన పార్టీలు పదేపదే అబద్ధాలు చెప్పాయి.


## పారిశుద్ధ్య కార్మికులకు ప్రమాద బీమా రూ. కోటి



- 55,686 మందికి మేలు కలిగేలా యాక్సిస్ బ్యాంక్ శాలరీ అకౌంట్లు
- కార్మికుల కోసం ప్రమాద, ఆరోగ్య బీమా స్కీంను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఈ కొత్త ఆర్థిక సదుపాయం ద్వారా మున్సిపల్ కార్మికులకు గణనీయమైన భరోసా లభించనుంది.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్, పెద్దాపురం


మున్సిపల్ కార్మికులు, వారి కుటుంబాలకు సంక్షేమం, భద్రత అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దాపురంలో పర్యటించిన ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రమాద, ఆరోగ్య బీమా స్కీంను లాంఛనంగా ప్రారంభించారు. పట్టణాభివద్ధి శాఖ-ఆక్సిస్ బ్యాంక్ సంయుక్తంగా ఈ స్కీంను అమలు చేసేలా ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఇప్పటికే మున్సిపల్ కార్మికుల శాలరీ ప్యాకేజ్ ఖాతాలు - మిగతా3లో



## భారత్‌తో సమస్య ఉంటే..

### ట్రంప్‌కు జైశంకర్ స్పష్టం

- దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే తమ ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయి
- భారత్-అమెరికా మధ్యవాణిజ్య చర్చలు దఇంకా కొనసాగుతున్నాయి
- అయితే మన దేశానికంటూ కొన్ని ప్రయోజనాలున్నాయి
- మన రైతులు, చిన్నస్థాయి ఉత్పత్తిదారుల ప్రయోజాలను కాపాడేందుకే తమ ప్రాధాన్యత



## 2035 నాటికి భారత్‌కు సొంత అంతరిక్ష కేంద్రం

- అంతరిక్ష రంగంలో కొత్త పుంతలు తొక్కుతున్నది
- ప్రధాని మోదీ అందించిన దిశ, దార్శనికతల ఆధారంగా చంద్రయాన్-4 మిషన్ మనకు సాకారమయ్యింది
- వీనస్ ఆర్బిటర్ మిషన్‌కు కూడా చేరువయ్యాం
- ఇస్రో చైర్మన్ వీ నారాయణన్

## ఇప్పటిదాకా ఓ లెక్క.. ఇప్పటినుంచి మరో లెక్క

ఏపీ జేఏసీ అమరావతి

ఉద్యోగులకు సంబంధించిన అన్ని సమస్యలు తీరుస్తామని గతంలో చంద్రబాబు చెప్పారు

జూన్‌లో జరగాల్సిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఆగస్టులో జరిగాయి.

సీఎస్ఎంఎఫ్‌లో సంబంధం లేకుండా ప్లే స్లిప్‌లో మా బకాయిలు చూపించాలి



చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ

మూడు నెలల్లో పెండింగ్ బకాయిలు క్లీయర్ చేయకపోతే పోరుబాట పడతామని చంద్రబాబు సర్కార్‌ను ఏపీ జేఏసీ అమరావతి హెచ్చరించింది. శనివారం కార్యవర్గ సమావేశంలో ప్రభుత్వంపై మా వైఖరీలో "ఇప్పటివరకు ఒక లెక్క.. ఇప్పటి నుంచి మరో లెక్క" అంటూ తేల్చి చెప్పింది. ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు మాట్లాడుతూ.. ఏడాది దాటినా కానీ.. సీఎం, కేబినెట్ ఉపసంఘం మాతో చర్చించలేదన్నారు. ఉద్యోగులకు సంబంధించిన అన్ని సమస్యలు తీరుస్తామని గతంలో చంద్రబాబు చెప్పారు. జూన్‌లో జరగాల్సిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఆగస్టులో జరిగాయి. ఏ అంశం పరిష్కారం కాలేదు" అని ఆయన మండిపడ్డారు. "ఒక్కో ఉద్యోగికి మూడు నుండి 5లక్షలు, రిటైర్డ్ ఉద్యోగులకు 15 నుండి 20 లక్షలు బకాయిలు ఉన్నాయి. సీఎస్ఎంఎఫ్‌లో సంబంధం లేకుండా ప్లే స్లిప్‌లో - మిగతా3లో

## విద్యార్థుల ప్రతిభకు పురస్కార అవార్డు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్ ఆగష్టు 23**

పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ప్రతిభ ధ్రువపత్రాలు అందించారు. మండలంలోని గడ్డం వారి పల్లి పంచాయతీ బత్తలాపురంకు చెందిన భవ్యశ్రీ, రెడ్డిరాణిలను 2024 /25 సంవత్సరంలో పదవతరగతి నందు మదనపల్లి గురుకుల పాఠశాల నందు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ సంస్థకు సంబంధించి క్రెడిట్ యాక్సిస్ ఇండియన్ ఫౌండేషన్ తరపున విద్యాసంస్థలో అధిక మార్కులతో ప్రభుత్వ పాఠశాల నందు చదివి ప్రతిభ కనబరిచిన 8 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి 10000 చొప్పున ప్రతిభ పురస్కారంతోపాటు ప్రశంసాపత్రాలను అన్నమయ్యజిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి చేతులమీదుగా అందించారు, ఈ మేరకు స్థానికులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ తరపున డివిజనల్ మేనేజర్ జగదీష్ ఏరియా మేనేజర్ హను మంతయ్య సుంకన్న బ్రాంచ్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో
# జాతీయ అంతరిక్ష దినోత్సవం - 2025

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 23:**

కుప్పం ఇంజనీరింగ్ కళాశాల, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం - 2025ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైనూ బప్పు అబ్జర్వేటరీ (విబిఓ), కవలూరు, ఇండియన్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ ఐఐఎకి చెందిన డాక్టర్ గౌరవ్ బెనర్జీ, పీహెచ్.డి., హాజరై "ఫ్రమ్ ఏ ఫిషింగ్ విలేజ్ టు మూన్ అండ్ మార్స్ : ఇండియన్స్ జర్నీ టు స్పేస్" అనే అంశం పై విశిష్టమైన ప్రసంగాన్ని అందించారు. డాక్టర్ గౌరవ్ బెనర్జీ ప్రసంగం అత్యంత ప్రేరణాత్మకంగా సాగింది. ఆయన భారత అంతరిక్ష యాత్రను, ఒక చిన్న మత్స్య కార గ్రామం నుంచి మొదలుకొని చంద్రుడు, మంగళ గ్రహాల వరకు తీసుకువెళ్లిన ప్రయాణాన్ని ఆవిష్కరించారు. ముఖ్యంగా, భారత్ ఎలా అంతరిక్ష సాంకేతికతలో ప్రపంచ నాయకుడిగా అవతరించిందో ఆయన ఆసక్తికరంగా వివరించారు. కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్. సునిల్ రాజ్ విభాగ నిర్వాహకులను ప్రశంసిస్తూ ఇలాంటి అద్భుతమైన కార్యక్రమం నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సుధాకర్‌బాబు



విద్యార్థుల ను ఉద్దేశించి ప్రసంగించి, అంతరిక్షరంగంలో ఉన్న అవకా శాలను వివరించారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల విద్యా ర్థులు, అధ్యాపకుల బృందం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐ ఎస్ ఆర్ఓతో కలిసి "ప్రాక్సిమిటీ లైటింగ్ అలర్ట్ సిస్టం "ను అభివృద్ధి చేశారు. దీని ఆధారంగా రాష్ట్రం దేశంలోనే మొట్ట మొదటిగా మెరుపు హెచ్చరిక సాంకేతికతను అందించింది. జాతీయ అంతరిక్ష దినోత్స వం సందర్భాన్ని పురస్కరించుకుని మంత్రి నారా లోకేశ్ వజ్రపాత్ యాప్ గురించి ట్వీట్ చేస్తూ, ఈయాప్ వలన మెరుపు పిడుగులు పడక ముందే సమాచారం అందుతుందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ విషయం గురించి ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ జి.ఎన్. కొడందరామయ్య సభలో ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, కుప్పం ఇంజనీరింగ్ కళాశాల బృందం రాష్ట్రానికి గర్వకారణమైందని అన్నారు. ఈ సందర్భంగా పేపర్ పోస్టర్ ప్రెజెంటేషన్లలో భారత అంతరిక్ష పరిశోధన - గతం, వర్తమానం, భవిష్యత్తు, ఎఐ/ఏం ఎల్‌ఇన్ ఆస్ట్రానమీ, స్టార్టప్స్, రాకెట్ ప్రొపల్షన్ సైన్స్, రోబోటిక్స్ ఇన్ స్పేస్ వంటి అంశాలపై విద్యార్థులు తమప్రతిభను ప్రదర్శించారు. అదనంగా, వ్యాస రచన, క్విజ్, ఓపెన్ టాక్, షార్ట్ ఫిల్మ్ పోటీలు కూడా ఆకర్షణీయంగా జరిగాయి. ఫ్యాకల్టీలు, వివిధ విభాగాల హెడ్స్, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమా న్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమా న్ని కన్వీనర్ డాక్టర్ కె. రసాదురై ,ప్రొఫెసర్, ఇసిఇ, సమన్వయం చేయగా, డాక్టర్ పి. అజయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ సంతోష్ బి. పంజగల్, డాక్టర్ ఎం.ఎల్.లక్ష్మీపతి వంటి సమన్వయకర్తలు నిర్వహణలో భాగస్వామ్యం అయ్యారు.

## రాజనాలబండపై సత్య ప్రమాణాల జోరు




**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 23:**

జిల్లాలోని సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండపై శనివారం సత్య ప్రమాణాల జోరు కొనసాగింది. ఉదయాన్నే టీటీడీ టెంపుల్ ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తిచే ప్రసన్న ఆంజనేయస్వామి శ్రీలక్ష్మీ నరసింహ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. మదనపల్లి నిమ్మనపల్లి రాజులూరు తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేసుకున్నారు. కొందరు ప్రమాణాలు చేయగా మరి కొందరు వాయిదా వేసుకొని వెళ్లారు, టిటిడి అధికార సిబ్బంది పాల్గొన్నారు.

## కనుల పండుగగా జేష్టా దేవి, శనీశ్వర స్వామి కళ్యాణోత్సవం







**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 23:**

వి కోట గ్రామంలోని శ్రీలక్ష్మి నరసింహ నగర్లో వెలిసిన శనీశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవ వేడుకలు కనుల పండుగగా జరిగింది. శ్రావణ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో స్వామి, అమ్మవారికి ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ రాజు సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాది కార్యక్రమాల అనంతరం, స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, కళ్యాణోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రావణ అమావాస్యనాడు జేష్టా దేవి, శనీశ్వర స్వామి వాళ్ళ కల్యాణోత్సవ వేడుకలు జరగడం ఆలవాయితీగా వస్తుందన్నారు. ఈ వేడుకలు విజయవంతంగా ముగియడానికి సహకరించిన ఆలయ కమిటీ సభ్యులకు, స్వామి వారి భక్తులకు ధన్యవాదాలు తెలిపారు.

## వరి పంట సాగు పై రైతులకు అవగాహన



**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్ ,ఆగష్టు 23:**

వీకోట మండలం మద్దిమగనపల్లి రైతు భరోసా కేంద్రంలో శనివారం రోజు వ్యవసాయ అధికారులు మరియు సచివాలయ సిబ్బంది. ఆధ్వర్యంలో వరిసాగు పై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు సూచనలు సలహాలు ఇస్తూ ఈ సీజన్లో ఒరిస్సాగుకు ఏ దశలో ఎంత నీరు పెట్టాలి, పంటను ఎలా అభివృద్ధి పరచుకోవాలి కంకులు ఎక్కువ దిగుబడి రావడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు సలహాలు సూచనలు అందించినారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని రైతులు అత్యధికంగా పాల్గొన్నారు.

## ఈనెల 25వ తేదీన ఉచిత
## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 23:**

శ్రీకాళహస్తి వినాయక చారిటబుల్ ట్రస్ట్ అధినేత సురేంద్ర కుమార్ రెడ్డి శ్రీకాళహస్తిలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సురేంద్రకుమార్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా ఈనెల 25వ తేదీన శ్రీకాళహస్తి నియోజకవర్గంలో దాదాపు 1500 విగ్రహాలను తమ ట్రస్టు ద్వారా ఉచితంగా వినాయక చవితి కమిటీ భక్తులకు అందజేస్తున్నా మని, ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వినాయక చవితి కమిటీ సభ్యులు, నియోజకవర్గంలోని విగ్నేశ్వరునిభక్తులు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గోపి, తిరుమల తిరుపతి ప్రచార రథం సభ్యుడు రాజ్ కుమార్, అవధూత పేపర్ ఎడిటర్ ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆదినేపల్లి గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రకార్యక్రమం.

**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ప్రెస్ ఆగస్టు 23:**



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టినటువంటి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా పల్లి గ్రామంలో అంగన్వాడి కార్యకర్త విద్యార్థులు మరియు గ్రామస్తులతో కలిసి గ్రామం వీధులలో తిరుగుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ వీధులలో ఎక్కడప డితే అక్కడ చెత్త పడేయకూడదని తడి చెత్త, పొడి చెత్త అని వేరువేరుగా సేకరించి వాటిని ఒక నిర్దేశ స్థలములోనే పడవేయాలని ఎక్కడపడితే అక్కడ వేయరాదని ప్రజలకు తెలియజేసినారు. ఈ ర్యాలీలో అంగన్వాడీ వర్కర్ తో పాటు గ్రామస్తులు కొందరు పాల్గొన్నారు

## తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని
# కలిసిన రెడ్డిసంఘం నాయకులు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 23:**

తుడా ఛైర్మన్, టిటిడి బోర్డుసభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డిని వెదురుకుప్పం మండల నాయకులు సోమశేఖర్ రెడ్డి, సునీల్, సురేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, జితేంద్రతదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

## సురవరం సుధాకర్ రెడ్డికి రేణిగుంటలో ఘన నివాళ్ళు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 23 :**

కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతి చెందడం భారత కమ్యూనిస్టుపార్టీకి తెలుగు రాష్ట్ర ఉద్యమానికి తీరని నష్టమని రేణిగుంట మండలం సిపిఐపార్టీ కార్యదర్శి వైఎస్ మనీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధాకర్ రెడ్డికి రేణిగుంట మండల సమితి రైల్వే స్టేషన్ వద్ద తన నివాళులు అర్పించారన్నారు. సుధాకర్‌రెడ్డి మా మధ్య లేకున్నా వారి జ్ఞాపకాలు ఎప్పటికీ మా వెంట ఉంటాయన్నారు. రైతు కోసం, కార్మికుల కోసం, ప్రతి అణగారినవారి కోసం మాట్లాడారు, పోరాడారు అని గుర్తు చేసారు.పోరాటానికి భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను సన్నద్ధం చేశారని అన్నారు. మీ స్వరం మాకు ధైర్యం, మీ జీవితం మాకు ఆదర్శమన్నారు. కార్యకర్తగా కమ్యూనిస్టు పార్టీని గ్రామ గ్రామాన విస్తరింప చేయటంలో ఆయన చూపిన బాటలోనే నడుస్తామన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పేద ప్రజలకు అన్ని కార్మిక వర్గాలను కలిపి ఐక్యం చేసి పోరాటాలకు సమర్థం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్ష కార్య దర్శులు వికార్తీక్, టి మల్లీ, మురళి, సెల్వా, చంద్రకళ, భాను, రమణ, అమ్ములు, శివమి ,అమ్ములు, మనీ తదితరులు పాల్గొన్నారు.

# నక్కల కాలనీలో కార్డెన్ సెర్చ్



**వెదరు కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 23:**

చిత్తూరు జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు నగిరి డిఎస్పి మహమ్మద్ అజీజ్, సూచనలతో కార్వేటి నగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతప్ప సారధ్యంలో ఎస్ఐ వెదురుకుప్పం, సిబ్బందితోపాటు వెళ్లి నక్కల కాలనీలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ ను చేసి వారి వద్ద నుండి సుమారు 12 మోటర్ సైకిల్ ను స్వాధీనం చేసుకొని, వాహన రికార్డులు తనిఖీ చేయడమైనది. అదేవిధంగా నక్కల కాలనీ గ్రామ వాసులకు తగు సూచనలు ఇవ్వడ మైనది.

## కోలా ఆనంద్‌కు ఘన సత్కారం



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 23 :**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన ఉపాధ్యక్షులు కోలా ఆనంద్‌ని జిల్లాప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ నేతృత్వంలో రేణిగుంట మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు కలసి కోలా ఆనంద్‌ని ఘనంగా సన్మానించారు. మార్వాడీల వేషధారణతో కూడిన తలపాక,పట్టు వస్త్రాలు, గజపూలమాలతో ఘనంగా సత్కరించి ఆయనకు అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ మాట్లాడుతూ బీజేపీలో కోలా ఆనంద్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రెండు సార్లు రాష్ట్ర కార్యదర్శిగా ప్రస్తుతం ఉపాధ్యక్షులుగా నియమించిన జాతీయ నాయకులు, ప్రియతమా ప్రధాని నరేంద్ర మోదీ, జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షులు శపోకల వంశీ నాగేంద్ర మాధవ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి, ప్రత్యేకించి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్‌కి శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ నేతలు, కార్యకర్తలు వారికి ప్రత్యేక ధన్య వాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పీకే గోపి అచ్చారి, పెద్దపాలెం రవి ఆచారి, కంద్రిగ యతీంద్ర రెడ్డి, జాన్ మధుకర్, శ్యాంచంద్ గెహ్లాట్, కొండేటి ప్రేమ్, కలవ పూడి అన్నపూర్ణమ్మ, పూమని, మునివేలు, వెంకటమునిరెడ్డి, అశోక్, ఆనంద్, పురుషోత్తం, జనంకోసం వేణు,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలపై పోలీసుల ప్రత్యేక నిఘా



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్ , ఆగస్ట్ 23:**

అన్నమయ్యజిల్లా పీలేరు విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసించి తమ లక్ష్యాలను చేరుకోవాలి సిఐ యుగంధర్ తెలిపారు. పీలేరు పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు, పాఠశాలలపై పీలేరు పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచామని, విద్యార్థిని విద్యార్థుల పట్ల పాఠశాలలకు వెళ్ళే సమయంలో ఎవరైనా ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించిన, అనవసరంగా రాద్ధాంతం సృష్టించిన ఎంతటి వారినైనా సరే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ యుగంధర్ హెచ్చరించారు. ఎవరిపైన, ఎలాంటి అనుమానాలు ఉన్న వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శనివారం ప్రభుత్వ పాఠశాల దగ్గర అనుమానంగా ద్విచక్ర వాహనాలలో తిరుగుతున్న ఆకతాయిలను విచారించి వారికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్ లో చేరి సమాజానికి సేవ చేయండి

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 23:**



శ్రీకాళహస్తి విద్యార్థులు చిన్న తనము నుండే సేవా భావాన్ని పెంపొందించేందుకు స్కౌట్స్ అం డ్ గైడ్స్‌లో చేరాలని జిల్లా కార్యాలయ కమీషనర్ టి. రమేష్ బాబు కోరారు. ఆర్వీ బిఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలు గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకాళహస్తిలో ఇప్పటి వరకు 32 మంది తృతీయ సోపాన్, 12 మంది రాజ్యపురస్కార్ అవార్డులు పొందనట్లు తెలిపారు. ముందుగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమీషనర్ టి.రమేష్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య మాట్లాడుతూ చదువుతో పాటు సేవాభావాన్ని అలవరుచుకొవాలని కోరారు. స్కౌట్స్ మాస్టర్ ఎస్ కె. అజారుద్దీన్, కె. మహేంద్ర, ఉపాధ్యాయులు మణి విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం వల్ల కాలిగే ఉపయోగాలని తెలియజేశారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్ చేరేందుకు ముందుకు వచ్చారు.

Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్ ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక




# తెలుగు సెంటిమెంట్ పండుతుందా?

-మొదటిపేజీ తరువాయి

ఆరోపణలకు బలం చేకూర్చినట్లవుతుందన్నది వారి భయం కావచ్చు. అలాగని బీజేపీ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతిస్తే బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసిపోయాయన్న కాంగ్రెస్ ప్రచారానికి బలం చేకూరినట్టు అవుతుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు ఉన్న నాలుగు ఓట్లు ఎవరికి పడతాయన్నది ఆసక్తికరంగా మారింది. తటస్థంగా ఉండే అవకాశం ఉంది. పీవీ నరసింహారావు నంద్యాల నుంచి లోక్‌సభకు పోటీ చేసినప్పుడు టీడీపీ ఆయనకు మద్దతిచ్చిన మాట వాస్తవమే కానీ.. తరువాతి కాలంలో పీవీ తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు టీడీపీని చీల్చి ఏడుగురు ఎంపీలను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. పైగా... పీవీ ప్రధానిగా ఉండగా.. ఆ తరువాత కూడా కాంగ్రెస్ పార్టీ ఆయనకు తగిన గౌరవం ఇవ్వలేదన్న విషయాన్ని బీజేపీ, బీఆర్ఎస్‌లు ఇప్పుడు ఎత్తి చూపుతున్నాయి. పీవీ మరణాంతరం ఆయన భౌతిక కాయాన్ని ఏఐసీసీ ఆఫీస్ ఆవరణలోకి అనుమతించలేదని ఆ పార్టీలు వ్యాఖ్యానిస్తున్నాయి. వీటికి కాంగ్రెస్ సమాధానం ఇచ్చే పరిస్థితి లేదు. ఇంకో విషయం. ప్రముఖ నేత నీలం సంజీవరెడ్డి తొలిసారి కాంగ్రెస్ అధికారిక అభ్యర్థిగా రాష్ట్రపతి పదవికి పోటీ చేసినప్పుడు ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ పార్టీ నిర్ణయాన్ని కాదని స్వతంత్ర అభ్యర్థి వీవీ గిరికి మద్దతిచ్చారు. అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ నీలం సంజీవరెడ్డికి కాకుండా వీవీ గిరికి మద్దతిచ్చింది. ఆ సమయంలో కాసు బ్రహ్మానందరెడ్డి సీఎంగా ఉన్నారు. అప్పుడు కూడా తెలుగు సెంటిమెంట్ పట్టించుకోలేదన్నమాట. నీలం సంజీవరెడ్డి రెండోసారి జనతా పార్టీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా రాష్ట్రపతి పదవికి ఎన్నికయ్యారు. తెలుగువాడైన వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతి పదవికి పోటీ చేసినప్పుడు తెలంగాణ కాంగ్రెస్ సపోర్టు చేసిందా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. అప్పట్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ గోపాలకృష్ణ గాంధీని బలపరిచింది.

ఇక ఏపీ విషయాన్ని చూస్తే రెండు సభలలో కలిపి తెలుగుదేశం కు 17 మంది ఎంపీల బలం ఉంది. జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. బీజేపీకి ఆరుగురు సభ్యులు ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌కు 11 మంది ఎంపీలున్నారు. తమకు మద్దతివ్వాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాద్ సింగ్ వైసీపీ అధ్యక్షుడు జగన్ ను కోరారు. రాజ్యాంగ పదవులకు ఎన్నిక జరిగినప్పుడు అనుసరించడానికి జగన్ ఒక పద్ధతి పెట్టుకున్నారు. ఆ ప్రకారమే ఎన్డీయేకు మద్దతిస్తున్నట్లు శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. ఇక టీడీపీ, జనసేనలు ఎన్డీయేలోనే ఉన్నందున అవి సుదర్శనరెడ్డికి ఓటు వేసే పరిస్థితి లేదు. చంద్రబాబుకు, రేవంత్ రెడ్డి కు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ రాజకీయంగా ఉప రాష్ట్రపతి ఎన్నికలో కాంగ్రెస్ కూటమికి టీడీపీ మద్దతు ఇవ్వలేదు. కాకపోతే జస్టిస్ సుదర్శనరెడ్డి తనకు చంద్రబాబుతో ఉన్న సంబంధాల గురించి వ్యాఖ్యానించిన



తీరు ఆసక్తికరంగా ఉంది. చంద్రబాబుతో ప్రత్యేక అనుబంధం ఉందని కాని, సంబంధం లేదని కానీ చెప్పలేనని ఆయన అంటున్నారు. 1995లో ఎన్టీఆర్, చంద్రబాబుల మధ్య జరిగిన న్యాయ పోరాటానికి సంబంధించి తీర్పు ఇచ్చిన బెంచ్‌లో తాను కూడా సభ్యుడనని ఆయన వెల్లడించారు. చంద్రబాబు మంచి, చెడు బేరీజు వేసుకోవచ్చని, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఆయన సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నానని ఆయన అన్నారు. సుదర్శనరెడ్డి వ్యూహాత్మకంగా మాట్లాడినా చంద్రబాబు ఇప్పటికిప్పుడు ఎన్డీయేను కాదనే పరిస్థితి లేదు. కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఒక ప్రకటన చేస్తూ సుదర్శనరెడ్డికి మద్దతు ఇచ్చి తన కృతజ్ఞత తెలుపుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ చంద్రబాబుపై ఆశలు పెంచుకుంటున్నట్లుగా ఉంది. బీహారు శాసనసభ ఎన్నికలలో బీజేపీ కూటమి ఓడిపోతే, కేంద్రంలో మోడీ ప్రభుత్వం పడిపోయే అవకాశం ఉందని, చంద్రబాబు ఎన్డీయే నుంచి బయటకు వస్తారని కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు అల్కా లాంబా జోస్యం చెప్పారు. భవిష్యత్తులో ఏమి జరుగుతుందో చెప్పలేం కాని చంద్రబాబుతో కాంగ్రెస్‌కు ఉన్న రహస్య సంబంధాలను ఆమె తెలియచేసినట్లుగా ఉంది. రేవంత్ రెడ్డి ద్వారా రాహుల్ గాంధీతో చంద్రబాబు హాట్ లైన్ పెట్టుకున్నారని ఇప్పటికే మాజీ సీఎం జగన్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. తెలంగాణ వరకు చూస్తే లోక్ సభలో కాంగ్రెస్‌కు ఎనిమిది, రాజ్యసభలో ముగ్గురు సభ్యులు ఉన్నారు. బీజేపీకి 8 మంది లోక్‌సభ సభ్యులు ఉన్నారు. ఎంఐఎంకు ఒకటి, బీఆర్ఎస్‌కు నాలుగు రాజ్యసభ స్థానాలూ ఉన్నాయి. ఈ రకంగా చూస్తే సుదర్శనరెడ్డికి కేవలం ఈ 12 మంది మద్దతు మాత్రమే లభించే పరిస్థితి ఉంది. కాగా తెలుగు సెంటిమెంట్‌ను రేవంత్ రెడ్డి వాడితే, బీజేపీ కూటమి తమిళ సెంటిమెంట్ వాడే అవకాశం ఉంటుంది. అక్కడ మెజార్టీ స్థానాలు డీఎంకే పార్టీకి ఉన్నాయి. కాంగ్రెస్, డీఎంకేలు ఒకే కూటమిలో ఉన్నాయి. అక్కడ బీజేపీ పక్షాన ఒక్క ఎంపీ కూడా లేరు. అన్నాడీఎంకేకు మాత్రం ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఉన్నారు. మిగిలిన వారు డీఎంకే, కాంగ్రెస్ కూటమికి చెందినవారే. అయినప్పటికీ తమిళనాడుకు చెందిన బీజేపీ నేతను ఉప రాష్ట్రపతి పదవికి పోటీలో దించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ ఈ ఎంపిక చేసి ఉండవచ్చు. పోటీచేస్తున్న రాధాకృష్ణన్ తన సొంత రాష్ట్రమైన తమిళనాడులో, సుదర్శనరెడ్డి తెలుగు రాష్ట్రాల నుంచి మెజార్టీ మద్దతు పొందలేరన్నమాట. కాగా బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పదే,పదే ప్రస్తావిస్తున్న కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి రెడ్డి అగ్రవర్ణాలకు చెందిన ప్రముఖుడిని అభ్యర్థిగా ఎలా పెడతారని బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రశ్నిస్తున్నాయి. సుదర్శనరెడ్డి గెలిస్తే బీసీ రిజర్వేషన్లకు కేంద్రంలో ఆమోదం తెలిపే అవకాశం ఉంటుందని రేవంత్ రెడ్డి అంటున్నారు. ఇది కూడా మోకాలికి, బోడు గుండుకు ముడిపెట్టడమే. కాగా ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్ బీసీ వర్గానికి చెందినవారని బీజేపీ ప్రచారం చేస్తోంది. అందువల్ల కాంగ్రెస్ బీసీ కార్డు ఈ సందర్భంగా పనిచేసే అవకాశం ఉండదు. మొత్తం మీద జస్టిస్ సుదర్శనరెడ్డిని ఎంపిక చేయడం ద్వారా కాంగ్రెస్ లో రేవంత్ రెడ్డి తన పరపతి పెంచుకునే అవకాశం ఉంది. అంతకు తప్ప ఆయన ప్రయోగించిన తెలుగు సెంటిమెంట్ కాని, బిసి రిజర్వేషన్ ల వాదన కాని ఫలించే పరిస్థితి కనిపించడం లేదు.

# జగన్ జైలు రన్.. కొంత మందికే పరామర్శ

**విజయవాడ :** అధికారం పోయిన తర్వాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా వివిధ కేసుల్లో జైలుకు వెళ్తున్నారు. వల్లభనేని వంశీ నుంచి కాకాణి గోవర్ధన్ రెడ్డి వరకూ చాలా మంది నేతలు జైళ్లకు వెళ్లారు. వారందర్నీ జగన్ ఆయా జైళ్లకు వెళ్లి పరామర్శించారు. పోసాని వంటి కొంత మందిని పరామర్శించలేదు. అదే సమయంలో లిక్కర్ స్కామ్ లో అరెస్టయిన వారెవర్నీ పరామర్శించలేదు. ఈ కేసులో అరెస్టు అయిన వారందరూ జగన్‌కు అత్యంత సన్నిహితులే. మిథున్ రెడ్డి .. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు. ఆయనకు లిక్కర్ కేసుతో ఏం సంబంధం లేదని జగన్ పలుమార్లు ప్రెస్మీట్లలో చెప్పారు. అయితే సుప్రీం కోర్టులోనూ ఊరట లభించకపోవడంతో చివరికి రాజంపేట ఎంపీ అరెస్టు కావాల్సి వచ్చింది. కానీ జగన్మోహన్ రెడ్డి ఇప్పటి వరకూ ఆయనను పరామర్శించలేదు. ఇరవై ఐదో తేదీన జగన్ .. మిథున్ రెడ్డిని పరామర్శించేందుకు రాజమండ్రి వస్తారని బొత్స సత్యనారాయణ ప్రకటించారు. కానీ ఒక్క రోజులోనే ఆ ప్రోగ్రాం క్యాన్సిల్ అయినట్లుగా బొత్స ప్రకటించారు. ఇక జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా పని చేసిన రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిలను కూడా జగన్ పరామర్శించలేదు. వారిద్దరూ జగన్ కు అత్యంత సన్నిహితులు. ధనుంజయ్ రెడ్డి.. జగన్ సీఎంగా ఉన్న ఐదు సంవత్సరాల పాటు సీఎంవోలో చక్రం తిప్పారని అంటారు. అన్ని పనులు ఆయన చేతుల మీదుగానే జరిగేవని చెబుతారు. అలాంటి ధనుంజయ్ రెడ్డి అరెస్టు అయినా జగన్.. జైలుకు వెళ్లి పరామర్శించలేదు. కృష్ణమోహన్ రెడ్డి కూడా జగన్‌కు సన్నిహితులే. వీరిని కూడా ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు వస్తున్నాయి. లిక్కర్ కేసులో జగన్మోహన్ రెడ్డి పేరు కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. సిట్ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌లో జగన్ ప్రస్తావన ఉంది. అసలు ఈ లిక్కర్ స్కామ్‌లో అంతిమ లబ్దిదారుడు జగన్మోహన్ రెడ్డేనని సిట్ చెబుతోంది. ఇలాంటి సమయంలో లిక్కర్ కేసు నిందితుల్ని పరామర్శించకపోవడం వెనుక ప్రత్యేక వ్యూహం



ఉందంటున్నారు. వారిని పరామర్శిస్తే అందరూ కలిసి ప్లాన్ చేశారని.. అందుకే వారి కోసం జైలుకు వచ్చారని ప్రచారం జరిగే అవకాశం ఉందని వైసీపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. లాయర్లు, న్యాయనిపుణుల సూచనల మేరకే జగన్.. తనకు అత్యంత ఆత్మీయులు అయినప్పటికీ లిక్కర్ కేసు నిందితుల్ని జైలుకు వెళ్లి పరామర్శించడం లేదని చెబుతున్నారు. అయితే టీడీపీ నేతలు మాత్రం జగన్మోహన్ రెడ్డి అందర్నీ బలి చేసి తాను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు.

కోటరీ నుంచి బయటకు ఎప్పుడు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయి పదమూడు నెలలు కావస్తుంది. ఈ పదమూడు నెలల్లో పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు ఏమైనా తీసుకున్నారంటే ఏమీ లేదనే చెప్పాలి. ప్రభుత్వ నిర్ణయాలు, హామీలు అమలు చేయకపోవడంపై నిరసనలు వ్యక్తం చేయడం మినహా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి తీసుకున్న చర్యలు ఏమైనా ఉన్నాయా? అంటే శూన్యమే అని చెప్పాలి. వైసీపీ అధినేత వైఎస్ జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి నెలలో రెండు సార్లు రావడం అందుబాటులో ఉన్న నేతలతో సమావేశం కావడం మినహా మరే రకమైన కార్యక్రమాలను చేపట్టలేదు. ఇక రైతుల సమస్యలపై జిల్లాలకు వెళ్లి వారి బాగోగులను తెలుసుకోవడం, అక్రమ కేసుల్లో ఇరుక్కున్న పార్టీ నేతలను పరామర్శించడం వంటి వాటితో సరిపెట్టేశారు. ఇక ఓటమిచెందిన తొలి నాళ్లలో ముఖ్య కార్యకర్తలతో జగన్ ముఖాముఖి అని హడావిడి చేసినా ఒకటి రెండు జిల్లాలతోనే సరిపెట్టేశారు. అందులోనూ స్థానికసంస్థల ప్రతినిధులు అధికార పార్టీకి వెళ్లకుండా ఉండేందుకు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశాలు పెట్టి పార్టీలో కొనసాగితే రాజకీయ భవిష్యత్ ఉంటుందని భరోసా ఇచ్చారు. నిజానికి 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలయిన తర్వాత చంద్రబాబు ఊరికే కూర్చోలేదు. జిల్లాలను పర్యటించారు. నేరుగా జిల్లాలకే వెళ్లిన చంద్రబాబు నేతలు,కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఇప్పుడు ఓటమి భవిష్యత్ విజయానికి నాంది అని చెప్పి క్యాడర్ లో ధైర్యం నింపడంలో నాడు చంద్రబాబునాయుడు సక్సెస్ అయ్యారు. కానీ అధికారంలో ఉన్నప్పుడు జగన్ ఎలా ఉన్నారో.. కోల్పోయినప్పుడు కూడా అదే స్థాయిలో తాడేపల్లి పార్టీ కార్యాలయాన్ని వీడటం లేదు. పాదయాత్ర చేస్తారనని అంటున్నాఅందుకు చాలా సమయం ఉంది. కానీ అంతకంటే ముందుగా జిల్లాల్లో సమావేశాలు నిర్వహించాలి. జిల్లా కేంద్రాల్లో అన్ని నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తలు,నేతలను పిలిచి మాట్లాడాలి. వారి అభిప్రాయాలను తెలుసుకోవాలి. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వం చేసిన తప్పులను వారి నుంచి తెలుసుకోవాలి. ఓపిగ్గా వినాలి. మరొకసారి అధికారంలోకి వస్తే అలాంటి తప్పులు దొర్లవన్నహామీ వారికి అక్కడే ఇవ్వగలిగాలి. అంతేకాని అధికారంలో ఉన్నప్పటి లాగానే కోటరీ మధ్య చిక్కుకుంటే పరిస్థితుల్లో మార్పు రాదన్న విషయం జగన్ గుర్తించాలన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. మరి నేను ఉన్నాను.. నేను విన్నానంటూ జనం మధ్య నాడు వెళ్లినట్లే ఇప్పుడు క్యాడర్ మధ్యకు వైసీపీ చీఫ్ వెళ్లాల్సి ఉంది.

# స్కూటర్ మెకానిక్‌లకు కమ్యూనిటీ భవనం

## మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

**రేణిగుంట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 23 :**

ఎన్నికల ప్రచారంలో తమకు ఒక కమ్యూనిటీ భవనం కోసం చిన్న స్థలం కావాలని ఆనాడు స్కూటర్ మెకానిక్ లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని కోరారు. దీంతో శనివారం రేణిగుంట మండలంలోని స్కూటర్ మెకానికులు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషాతో కలిసి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని కలిసి సన్మానించి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన తాను ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట కట్టుబడి ఉన్నానని,వెంటనే వీరికి కమ్యూనిటీ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని, దీంతోపాటు అర్హులైన అందరి మెకానికులకు ఇళ్లస్థలాలు కూడా కేటాయించాలని తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డిని ఆదేశించారు .దీంతో పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డిని కలిసి స్థలం కేటాయించాలని కోరగా... వారం రోజుల్లో స్థలం కేటాయి స్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మెకానిక్‌లు



మాట్లాడుతూ సుమారు 15 ఏళ్లగా తాము కమ్యూనిటీ భవనం కోసం వేచి ఉన్నామని, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తాను ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

## ఏపీ ఆర్థిక పరిస్థితిపై వైఎస్ జగన్ ఆందోళన

**తాడేపల్లి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళ వ్యక్తం చేశారు. ప్రధానంగా ఆదాయాలు తగ్గిపోయి, అప్పులు పెరిగిపోవడంపై వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కాగ్ నివేదికలను ఉటంకిస్తూ వైఎస్ జగన్ తన సోషల్ మీడియా అకౌంట్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. 'రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలు భారీగా తగ్గి, అప్పులు పెరిగి పోతున్నాయి. కూటమి ప్రభుత్వ విధానాలతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2019%-%24 మధ్య మా ప్రభుత్వంపై టీడీపీ, జనసేన పార్టీలు పదేపదే అబద్దాలు చెప్పాయి. రాష్ట్రంలో ఆదాయ వృద్ధి తగ్గిందనీ, అభివృద్ధి అనేదే లేదని తప్పుడు ప్రచారం చేశాయి. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామంటూ కూటమి నేతలు నమ్మబలికారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆదాయాలు భారీగా తగ్గాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయాలు కేవలం 3.08% మాత్రమే పెరిగాయి. కేంద్ర ప్రభుత్వ ఆదాయాల వృద్ధి 12.04% పెరగగా, ఏపీ ఆదాయం భారీగా తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం చెప్పినట్టు నిజంగానే ఏపీ ఆర్థిక వృద్ధి 12.02% ఉంటే, మరి ఆదాయం పెరుగుదల 3.08% దగ్గరే ఎందుకు ఆగిపోయింది?, గతేడాదితో పోల్చితే ఈఏడాది కొంత ఆశాజనకంగా ఉంటుందనుకుంటే మొదటి నాలుగు నెలల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది.

**బాబు సర్కార్ అప్పులు.. కాగ్ నివేదికపై వైఎస్ జగన్ రియాక్షన్**

ప్రజల్లో కొనుగోలు శక్తి కూడా బాగా తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆదాయాల వృద్ధి పది శాతం ఉండాల్సి ఉండగా, కేవలం 2.39% మాత్రమే ఉంది. మా హయాంలో అన్ని రకాల అప్పులు కలిపి రూ.3,32,671 కోట్లు మాత్రమే. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ 14 నెలల్లోనే ఏకంగా రూ. 1,86,361 కోట్లు అప్పు చేసింది. అంటే మా ఐదేళ్ల హయాంలో చేసిన అప్పుల్లో ఇప్పటికే 56% చేశారు. ఆదాయాలు తగ్గి, అప్పులు పెరిగిపోతున్న ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలి. అన్ని స్థాయిల్లో పెరిగిన అవినీతిని అరికట్టాలి' అని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ప్రమాద బీమా రూ. కోటి

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు. ఈ కొత్త ఆర్థిక సదుపాయం ద్వారా మున్సిపల్ కార్మికులకు గణనీయమైన భరోసా లభించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 123 అర్బన్ లోకల్ బాడీస్‌లో మొత్తం 55,686 మంది కార్మికులు సేవలందిస్తున్నారు. ఇప్పుడు ఈ స్కీం ద్వారా వీరందరికీ ఈ బీమా సదుపాయం లభించనుంది. వీరిలో 39,170 మంది పబ్లిక్ హెల్త్ విభాగంలో ఉండగా, 16,516 మంది ఇతర విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరిలో శాశ్వత, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న వారందరికీ ఈ పథకం వర్తించనుంది. ఇప్పటి వరకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరణించిన సందర్భాల్లో కుటుంబీకులకు ఎక్స్%-%గ్రేషియా రూపంలో ప్రభుత్వం సహాయం అందిస్తోంది. ప్రమాద మరణానికి రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ. 2 లక్షలు ఇచ్చే విధానం అమలులో ఉంది. ఇప్పుడు ఆక్సిస్ బ్యాంక్‌తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ద్వారా ఈ ప్రయోజనాలు మరింత విస్తరించాయి. శాశ్వత ఉద్యోగులకు ఒక రూ. 1 కోటి వరకు ప్రమాద బీమా, పది లక్షల లైఫ్ కవర్ లభించనుంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇరవై లక్షల ప్రమాద బీమా, రెండు లక్షల లైఫ్ కవర్ సదుపాయం ఉంటుంది. అంతేకాకుండా ప్రమాద మరణం జరిగితే పిల్లల చదువు కోసం గరిష్టంగా రూ. 8 లక్షల వరకు విద్యా సహాయం అందించనుంది. దీంతో పాటు తక్కువ ప్రీమియం ద్వారా ఆరోగ్య బీమా అందుబాటులో ఉంది. కుటుంబ సభ్యులతో కలిపి మొత్తంగా రూ. 33 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ఇదే కాకుండా మున్సిపల్ కార్మికుల కుటుంబ సభ్యులు మరో జీరో బ్యాలెన్స్ అకౌంట్ తెరిస్తే వారికి రూ. 15 లక్షల మేర ప్రమాద బీమా కూడా అందుబాటులోకి వస్తుంది. ఈ పథకం తమకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మున్సిపల్ కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఇప్పటిదాకా ఓ లెక్క.. ఇప్పటినుంచి మరో లెక్క

-మొదటిపేజీ తరువాయి

మా బకాయిలు చూపించాలి. నాలుగు డీఎలు పెండింగ్‌లో ఉన్నాయి. డీఏ, ఐఆర్ కోల్పోవడం, బకాయిలు ఇవ్వకపోవడంతో వేల కోట్లు నష్టపోయాం. మా హక్కును మేం అడుగుతున్నాం. మూడు నెలల్లో బకాయిలు చెల్లించకపోతే పోరుబాట పడతాం" అని బొప్పరాజు చెప్పారు. ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి దామోదర్ మాట్లాడుతూ.. ఉద్యోగి కుటుంబం నుంచి వచ్చానని చెప్పిన పవన్ ఇప్పుడు మాట్లాడటం లేదు. 2023 నుంచి ఐఆర్ రావాలి. వేల కోట్లు బకాయిలు ఉన్నాయి. మా సమస్యలు పరిష్కరించకుంటే ఎటువంటి ఉద్యమాకైన సిద్ధం. ప్రభుత్వ స్థలాలు, ఆర్టీసీ స్థలాలు ప్రైవేట్ వ్యాపారవేత్తలకు అప్పగిస్తే సంపద సృష్టి జరగదు.

# డిసెంబర్‌లో గగన్ యాన్

**నెల్లూరు :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో కీలక ప్రయోగాన్ని రెడీ అవుతోంది. మరో మైలు రాయిని అధిగమించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. మిషన్ గగన్‌యాన్‌కు సంబంధించి ఇస్రో పెద్ద అప్‌డేట్ ఇచ్చింది. ఈ ఏడాది డిసెంబర్‌లో గగన్‌యాన్-జి1ని ప్రయోగించనున్నట్లు ఇస్రో చీఫ్ వి. నారాయణన్ తెలిపారు. నాలుగు నెలల్లో ఈ రంగంలో అనేక విజయాలు సాధించామని నారాయణన్ అన్నారు. అటువంటి పరిస్థితిలో, ఈ ఏడాది చివరిలో, బహుశా డిసెంబర్‌లో మొదటి మానవరహిత మిషన్ జి1ను ప్రయోగించనున్నారు. అర్ధ-మానవుడిలా కనిపించే వ్యోమిత్ర కూడా అందులో ఎగురుతారని ఆయన అన్నారు. భారత్ పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో గగన్‌యాన్ ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు ఇస్రో ఛైర్మన్ ప్రకటించారు. విజయవంతమైన ఆక్సియం-4 మిషన్ నుండి ఇటీవలే తిరిగి వచ్చిన శుభఆన్షు శుక్లా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం అనుభవం భారతదేశ సొంత గగన్‌యాన్ మిషన్‌కు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. గగన్‌యాన్‌కు సంబంధించిన అనేక ప్రయోగాత్మక ప్రయోగాలను చేపట్టి విజయం సాధించింది. అందులో భాగంగానే అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపే దిశలో ఇస్రో మరో అడుగు ముందుకు వేస్తోంది .ఈ నేపథ్యంలోనే గగన్‌యాన్ ఉ1 ప్రయోగాత్మక రాకెట్ ప్రయోగాన్ని 2025 చివరి మాసంలో తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుండి ఉ1 రాకెట్ ప్రయోగాన్ని చేపట్టేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తోంది. అదేవిధంగా ఈ గగన్ యాన్ రాకెట్ ప్రయోగానికి సంబంధించి గగన్‌యాన్ ఉ1, గగన్‌యాన్ ఉ2, గగన్‌యాన్ ఉ3 లాంటి రాకెట్ ప్రయోగాలను కూడా 2026లో చేపట్టేందుకు ఇస్రో ఒక ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. అలాగే 2027 వ సంవత్సరంలో గగన్‌యాన్ భారత్ తొలి మ్యాన్ మిషన్ ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. ఒక రోబోను తయారుచేసి ఈ రాకెట్ ప్రయోగంలో అమర్చి అంతరిక్షంలో పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. అంతరిక్షంలోకి మానవులను పంపే ముందుగా ఈ రోబోను పంపి అక్కడ వివిధ పరిశోధనలు చేసి, ఆ సమాచారాన్ని శాస్త్రవేత్తలకు అందజేస్తుంది. అంతరిక్షంలోకి పంపిన రోబో హిందీ, ఇంగ్లీష్ భాషలలో పరిశోధనలు చేసిన సమాచారాన్ని శాస్త్రవేత్తలకు అందిస్తుంది. అంతరిక్షంలోకి వెళ్ళాక అక్కడ వ్యోమగాములు ఎలాంటి వాతావరణ పరిస్థితులను తట్టుకునే వీలు ఉంటుందన్న అంశాలపై కూడా ఈ రోబో అధ్యయనం చేసి శాస్త్రవేత్తలకు తెలియజేస్తుంది. గగన్‌యాన్ ప్రధాన ప్రయోగానికి ముందుగా అంటే 2027 లో రాకెట్ ప్రయోగంలో రోబోను అమర్చి ప్రయోగాన్ని చేపట్టేందుకు ఇస్రో శ్రీకారం చుట్టింది. మ్యాన్ మిషన్ సక్సెస్ చేయడం అంటే భూమి నుంచి అంతరిక్షంలోకి వాహక నౌక వెళ్లడమే కాదు.. అంతరిక్షంలో పరిశోధనలు పూర్తి చేసుకున్న తర్వాత తిరిగి భూమి మీదకు క్షేమంగా రావడమే ప్రయోగం పూర్తి విజయంగా చూడాల్సి ఉంటుంది. ఇందుకోసమే ఇస్రో పూర్తి స్వదేశీ టెక్నాలజీతో గగన్‌యాన్ మిషన్ చేపడుతున్న సందర్భంలో ప్రతి దశను సొంతంగా ప్రయోగాత్మక ప్రయోగాలు చేపట్టి అన్ని రకాలుగా పరీక్షలు చేపడుతోంది. అంతరిక్ష నుంచి భూమికి తిరిగి వచ్చేటప్పుడు వ్యోమగామిలు ప్రయాణించే క్యాప్సిల్ క్షేమంగా భూమి మీదకు తీసుకురావడం కూడా అత్యంత కీలకం.. కాబట్టి ప్రయోగాన్ని చేపట్టి భూమి నుంచి అంతరిక్షంలోకి వెళ్లడం మొదలు పరిశోధన పూర్తయ్యాక తిరిగి భూమి మీదకు క్షేమంగా వచ్చేవరకు అన్ని దశలను ఎప్పటికప్పుడు విజయవంతంగా పరీక్షలు చేపడుతోంది ఇస్రో.

## ఆదివారం 24 ఆగస్టు 202524న

## జూనియర్ బాల బాలికల షూటింగ్ బాల్ సెలెక్షన్స్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 23:** ఆగస్ట్ 24న జూనియర్స్ విభాగంలో బాలుర, బాలికల చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ జట్టు ఎంపిక పోటీలు రామకుప్పంలోనీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో ఉంటాయి. క్రీడా నైపుణ్యం కనపరిచిన మీ విద్యా సంస్థలోని క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి సెప్టెంబర్ మొదటి వారంలో జరగబోయే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు పంపడం జరుగుతుంది. ప్లేయర్ కట్ ఆఫ్ తేదీ:- 01- 04- 2006 అని చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ మహేష్, ప్రెసిడెంట్ పవన్ కళ్యాణ్ తెలిపారు. కావున మీ విద్యాసంస్థలోనీ క్రీడాకారులను సిద్ధం చేసుకోండి. ఇతర వివరములకు పి.టి.వేణుగోపాల్ (6301831236) ఆర్గనైజింగ్ సెక్రెటరీ. షూటింగ్ బాల్ అసోసియేషన్ చిత్తూరు.

## వినాయక చవితి వేడుకలను
## ప్రశాంతంగా జరుపుకోవాలి
### శ్రీకాళహస్తి డి.ఎస్.పి నరసింహమూర్తి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 23:** శ్రీకాళహస్తి పట్టణంలోని వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయు కమిటీ మెంబర్ల అందరిని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు పిలిపించి వారు పాటించ వలసినటువంటి నియమ నిబంధనల గురించి తెలియపరచి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలను కాపాడుటకు పోలీసులకు సహకరించవలసిందిగా తెలియపర చడం జరిగినది. డీజే శబ్దాలు, రికార్డింగ్ డాన్స్, బలవంతపు వసూళ్లు, ముందస్తు అనుమతి లేకుండా విగ్రహాలను ఉంచడం చట్టరీత్యా నేరమని అటువంటి చర్యలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించడం జరిగినది. ఈ సమావేశము నకు సుమారు 150 మంది కమిటీ మెంబర్లు పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిఎస్పి నరసింహమూర్తి, వన్ టౌన్ సిఐ గోపి, టూ టౌన్ సిఐ నాగార్జున రెడ్డి ,ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

## కోలా ఆనంద్‌ను సత్కరించిన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు
### కందుకూరి మురళి రాయల్



**రేణిగుంట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 23 :** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ఉపాధ్యక్షులుగా ఎన్నికైన కోలా ఆనంద్ గారిని రేణిగుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కందుకూరి మురళి రాయల్ శనివారం శ్రీకాళహస్తిలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి అభినం దనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు చిన్నరావు, ప్రైమ్ నైన్ ప్రతినిధి మునిరామయ్య, గరుడా టివి పాత్రికేయులు మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఏటీఎం కొత్త రూల్స్.. ఇక ఒక్కో ట్రాన్సాక్షన్‌కి రూ.23 ఛార్జ్



బ్యాంకు ఖాతాదారులకు డెబిట్ కార్డు (ఏటీఎం) కార్డులు ఉంటాయి. నగదు అవసరమైనప్పుడు బ్యాంకుకు వెళ్లకుండా సమీపంలోని ఏటీఎం ద్వారా తీసుకుంటారు. ఇతర బ్యాంక్ ఏటీఎంలో సైతం నగదు తీసుకోవచ్చు.అయితే, ఇష్టం వచ్చినన్ని సార్లు నగదు విత్ డ్రా, బ్యాలెన్స్ ఎంక్వైరీ వంటి బ్యాంకింగ్ సేవలు ఉచితంగా వినియోగించుకునేందుకు లేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త రూల్స్ ప్రకారం ఏటీఎం ఉచిత లావాదేవీల తర్వాత ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఒక్కో ట్రాన్సాక్షన్‌కి గరిష్ఠంగా రూ. 23 వరకు వసూలు చేయనున్నారు. మరి ఆ వివరాలు తెలుసుకుందాం. ఆర్‌బీఐ కొత్త రూల్స్ ప్రకారం హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ఏటీఎం ద్వారా ఒక నెలలో 3 ట్రాన్సాక్షన్లు మాత్రమే ఉచితంగా నిర్వహించవచ్చు. ఇక నాన్ మెట్రో ప్రాంతాల్లో ఈ లిమిట్ 5గా ఉంది. ఈ లిమిట్ దాటితే పీఎన్‌బీ, హెచ్‌డీఎఫ్‌సీ వండి బ్యాంకులు ఛార్జీలు విధిస్తాయి. అయితే, ఎస్‌బీఐ పాత ఛార్జీలనే వసూలు చేస్తుండడం కాస్త ఊరట కల్పించే విషయం. చాలా బ్యాంకులు కొత్త ఛార్జీలకు మారిపోయాయి. ఉచిత పరిమితిలో క్యాష్ విత్ డ్రా సహా బ్యాలెన్స్ ఎంక్వైరీ, పిన్ మార్పు వంటి ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్ లావాదేవీలు ఉంటాయి. అయితే, క్యాష్ రిసైక్లర్ మెషన్ ద్వారా నగదు జమ చేయడం అనేది ఉచితం. కానీ, ఏటీఎం ద్వారా నగదు ఉపసంహరణ అనేది లిమిట్ దాటితే ఛార్జీలు పడతాయి. ఇవి బ్యాంకును బట్టి మారుతుంటాయి. ఒక సారి మీరు లిమిట్ దాటిన తర్వాత ట్రాన్సాక్షన్ నిర్వహిస్తే అదనపు లావాదేవీలు ఒక్కో దానిపై రూ. 23 ప్లస్ జీఎస్‌టీ ఛార్జ్ చేస్తాయి బ్యాంకులు. ఉదాహరణకు పంజాబ్ నేషనల్ బ్యాంకులో లిమిట్ దాటిన తర్వాత ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లు నిర్వహిస్తే రూ. 23 ఛార్జ్ పడుతుంది. నాన్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లు అయితే రూ. 11 కట్టాల్సి వస్తుంది. ఏటీఎం నిబంధనలను పక్కనబెడితే బ్యాంక్ ఖాతాలో నగదు ట్రాన్సాక్షన్లకూ పరిమితి ఉంటుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక బ్యాంక్ ఖాతా నుంచి రూ. 20 లక్షలు ఆపైన డిపాజిట్ చేసినా, విత్ డ్రా చేసినా పాన్, ఆధార్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లావాదేవీల వివరాలు ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం చేతికి వెళ్తాయి. నల్లధనాన్ని అరికట్టి బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు ఈ పరిమితిని విధించారు. అందుకే ఏటీఎం ద్వారా ట్రాన్సాక్షన్లు నిర్వహించేటప్పుడు జాగ్రత్త వహించాలి. తమ ఖాతా ఉన్న బ్యాంక్ ఏటీఎంలలోనే నగదు విత్ డ్రా చేయడం మంచిది. అదనపు ఛార్జీలు పడకుండా చూసుకోవాలి.

# కేవలం 24 రూపాయలే.... వారందరికీ జియో మంచి ఛాన్స్!




ముకేశ్ అంబానీ నేతృత్వంలో ప్రారంభమైన జియో వ్యాపారాలు దూసుకెళ్తున్నాయి. కొత్త కొత్త రంగాల్లోకి ప్రవేశిస్తూ సంచలనాలు సృష్టిస్తున్నాయి. ఆర్థిక సేవల విభాగం జియోఫైనాన్స్ మరో సంచలనానికి తెరలేపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ ధరకే ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ ఫైల్ చేసే అవకాశాన్ని కల్పిస్తోంది. కేవలం 24 రూపాయలతో ఐటీఆర్ ఫైలింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు ఇది అదిరే శుభవార్త అనే చెప్పాలి. జియో ఫైనాన్స్ యాప్ ద్వారా కొత్త ట్యాక్స్ ప్లానింగ్, ఫైలింగ్ ఫీచర్ తెచ్చింది. ట్యాక్స్ పేయర్లు ఈ యాప్ ద్వారా పన్ను విధానం ఎంచుకోవడంతో పాటుగా గరిష్ఠ మినహాయింపులు పొందేందుకు సహాయం చేయనున్నట్లు జియోఫైనాన్స్ పేర్కొంటోంది. అయితే, ట్యాక్స్ పేయర్లలో ఒక ప్రశ్న మొదలైంది. రూ.24 ప్లాన్ అనేది ట్యాక్స్ పేయర్లందరికీ వర్తిస్తుందా? ఇతర ప్లాట్‌ఫామ్స్ అయిన క్లియర్ ట్యాక్స్, ట్యాక్స్ బడ్డీ, ట్యాక్స్ 2 విన్, మైఐటీ రిటర్న్ వంటి వాటితో ఎలా భిన్నంగా ఉంటుంది? అని ప్రశ్నిస్తున్నారు. జియోఫైనాన్స్ సంస్థ ట్యాక్స్ బడ్డీ భాగస్వామ్యంతో ఈ రూ.24 ప్లాన్ ప్రకటించింది. ప్రస్తుత ట్యాక్స్ మార్కెట్లో అత్యంత చీఫ్ ప్లాన్ అని చెప్పవచ్చు. ఇది ఒక బేసిక్ ప్లాన్. రూ.24 ప్లాన్ అనేది కేవలం ఐటీఆర్-1 ఫైలింగ్ కి మాత్రమే వర్తిస్తుంది. అంటే కేవలం రూ.5 లక్షల లోపు ఆదాయం ఉండి ఒకే ఫారం 16 అందుకునే ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ ప్లాన్ ద్వారా సీఏ సహాయం ఉండదు. ట్యాక్స్ పేయర్ స్వయంగా ఫైలి చేయాల్సి ఉంటుంది. నిల్ ఐటీఆర్ లేదా సింపుల్ ఐటీఆర్ 1 ఫైలింగ్ చేసేందుకు మాత్రమే వర్తిస్తుంది. అయితే ఇది బిజినెస్ ఆదాయం, క్యాపిటల్ గెయిన్స్, విదేశీ పెట్టుబడుల వంటి కాంప్లెక్స్ ట్యాక్సులు ఉన్న వారికి పని చేయదు. నిపుణుల సహాయం తీసుకోవాలని అనుకునే వారికి జియోఫైనాన్స్ రూ.999 ప్లాన్ అందిస్తోంది.

# ఆసియా కప్-2025: వాళిద్దరిని ఎందుకు ఎంపిక చేయలేదు?



ఆసియాకప్-2025 టోర్నమెంట్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఎంపిక చేసిన జట్టుపై విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. టీ20లలో నిలకడైన ఫామ్‌తో అద్భుతంగా రాణిస్తున్న శ్రేయస్ అయ్యర్‌ను పక్కనపెట్టడం ఇందుకు ప్రధాన కారణం. అదే విధంగా.. శుబ్‌మన్ గిల్ ను వైస్ కెప్టెన్‌గా జట్టులోకి తిరిగి తీసుకురావడం.. యశస్వి జైస్వాల్‌ను స్టాండ్ బై ప్లేయర్‌గా ఎంపిక చేయడం.. భారత క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంతేకాదు.. ప్రసిద్ కృష్ణను కాదని.. హర్షిత్ రాణాను ప్రధాన జట్టుకు ఎంపిక చేయడంతో సెలక్షన్ కమిటీ తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

**ప్రత్యక్ష ప్రసారం చేయాలి**

ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "అర్హులైన చాలా మంది ఆటగాళ్లకు జట్టులో చోటు దక్కడం లేదు. అసలు ఓ ఆటగాడిని ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తున్నారు?.. వేరొకరిని ఎందుకు పక్కనపెడుతున్నారు? అన్న విషయాలపై ప్రతి ఒక్కరికి స్పష్టత రావాలంటే.. సెలక్షన్ కమిటీ సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలి. చాలా కాలంగా నేను ఇదే మాట చెబుతున్నా. ఇప్పటికీ అదే అంటున్నా. ఏదో హడావుడిగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. అర్హులైన వారిని తప్పించడం గురించి ఒకటీ, అరా లైన్లలో సమాధానం చెప్పడం సరికాదు" అని మనోజ్ తివారి అభిప్రాయపడ్డాడు.

**వారిద్దరు అర్హులు.. అయినా ఎందుకు ఎంపిక చేయలేదు**

అదే విధంగా.. "ఆసియా కప్ జట్టులో స్థానానికి అర్హులైన ఇద్దరు.. శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్. కానీ వీరిద్దరికి జట్టులో చోటు దక్కలేదు. ప్రస్తుత హెడ్‌కోచ్ గౌతం గంభీర్ పాత ఇంటర్వ్యూలో ఓసారి పరిశీలిస్తే.. టీ20 జట్టు నుంచి జైస్వాల్‌ను అస్సలు పక్కనపెట్టకూడదని అతడు చెప్పిన సందర్భాలు కోకొల్లలు. ఇప్పుడు మరీ స్వయంగా అతడే ప్రధాన కోచ్. అయినా.. యశస్వి జైస్వాల్‌కు చోటు దక్కలేదు కదా!" అంటూ టీమిండియా యాజమాన్యం తీరుపై మనోజ్ తివారి ఆగ్రహం వ్యక్తం చేశాడు. వార్తా సంస్థ %వాచీ×%తో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశాడు.

**వేచిచూడాల్సిందే**

కాగా శ్రేయస్ అ?య్యర్‌ను ఆసియా కప్-2025 టోర్నీకి ఎంపిక చేయకపోవడం గురించి చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌కు మీడియా సమావేశంలో ప్రశ్న ఎదురైంది. ఇందుకు బదులిస్తూ.. "ఇందులో అతడి తప్పేం లేదు. మా తప్పు కూడా లేదు. జట్టులో స్థానం కోసం అతడు ఇంకొన్నాళ్లు వేచిచూడాల్సిందే. ప్రస్తుతం 15 మందికే అవకాశం ఉంది. అందులో అతడిని ఎవరి స్థానంలో పిలిపించాలో చెప్పండి" అంటూ ఎదురు ప్రశ్న వేశాడు. కాగా సెప్టెంబరు 9- 28 మధ్య ఆసియా కప్ టీ20- టోర్నీ నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. యూఏఈ ఇందుకు వేదిక.

# అనారోగ్యంతో కెప్టెన్సీకి దూరమైన గిల్.. బాధ్యతలు అతడికేనా..?



టెస్టు సారథిగా తొలి సిరీస్‌లోనే తన ముద్ర వేసిన శుభ్‌మన్ గిల్ బ్యాటర్‌గానూ గొప్పగా రాణించాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ ఆటగాళ్లకు కౌంటర్ ఇవ్వడంతో పాటు.. తన కూల్ కెప్టెన్సీతో తగిన నాయకుడు దొరికాడనే ప్రశంసలు అందుకున్నాడు. అండర్సన్ -టెండూల్కర్ ట్రోఫీలో సూపర్ ఫామ్‌తో చెలరేగిన గిల్ దేశవాళీ క్రికెట్‌లో దంచేస్తాడని అనుకున్నారంతా. దులీప్ ట్రోఫీలో కెప్టెన్‌గా తమ జట్టును టీమిండియా ప్రిన్స్ అలవోకగా గెలిపిస్తాడనుకుంది నార్త్ జోన్ కానీ. ఈ స్టార్ ప్లేయర్ అనారోగ్యం కారణంగా ఈ టోర్నీకి దూరమయ్యాడు. దేశవాళీ క్రికెట్ 2025-26 సీజన్‌లో మొదటిదైన దులీప్ ట్రోఫీ ఆగస్టు 28న మొదలవ్వనుంది. జోన్ల ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో నార్త్ జోన్ జట్టు శుభ్‌మన్ గిల్‌పై ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఇంగ్లండ్‌లో ఇరగదీసిన అతడికి కెప్టెన్సీ కట్టబెట్టి.. పటిష్టమైన స్క్వాడ్‌ను ఎంపిక చేసింది. కానీ, తీరా టోర్నీకి ఐదు రోజుల ముందు గిల్ అనారోగ్యానికి గురయ్యాడు. ఫిజియోథెరపిస్టులు అతడిని పరీక్షించి కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దాంతో.. సెప్టెంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న ఆసియా కప్‌లోపు కోలుకొని, ఫిట్‌నెస్ సాధించాలనుకుంటున్నాడు భారత సారథి. ప్రస్తుతం ఛండీగఢ్‌లోని తన ఇంట్లో సేద తీరుతున్న గిల్ తన ఆరోగ్యం మెరుగయ్యాక నెట్స్‌లో ప్రాక్టీస్ షురూ చేయనున్నాడు. దులీప్ ట్రోఫీకి శుభ్‌మన్ గిల్ దూరమైనందున వైస్ కెప్టెన్‌గా ఎంపికైన అంకిత్ కుమార్ నార్త్ జోన్ జట్టును నడిపించే అవకాశముంది. ఆసియా కప్ స్క్వాడ్‌లోని పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానాలు కూడా ఒకే ఒక మ్యాచ్ ఆడనున్నారు. యూఏఈకి వెళ్లడానికి ముందు ఇద్దరూ ఈస్ట్ జోన్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగుతారు.

**నార్త్ జోన్ స్క్వాడ్ :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), శుభం ఖజురియా, అంకిత్ కుమార్ (వైస్ కెప్టెన్), ఆయుష్ బదొని, యశ్ దయాల్, అంకిత్ కల్సి, నిశాంత్ సింధు, సాహిల్ లొత్రా, మయాంక్ దగర్, యుధ్‌వీర్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, అన్షుల్ కంభోజ్, అఖీబ్ నబీ, కన్హయ్య వధావన్ (వికెట్ కీపర్).

**రీప్లేస్‌మెంట్స్ :** ఒకవేళ గిల్, అర్ష్‌దీప్, హర్షిత్‌లు ఆసియాకప్ స్క్వాడ్‌కు ఎంపికైతే వీళ్ల స్థానాన్ని భర్తీ చేసేందుకు ముగ్గురిని ఎంపిక చేశారు సెలెక్టర్లు. శుభం రొహిల్లా (గిల్), గుర్నూర్ (అర్ష్‌దీప్ సింగ్), అనుజ్ థక్రాల్ (హర్షిత్ రానా).

## జీలగలు నవ ధాన్యాలు
## రైతులకు పంపిణీ కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 23:** శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు తొట్టంబేడు మండలం, ఇలగనూరు పంచాయతీ, సచివాలయం నందు రైతులకు 50% సబ్సిడీతో జీలగలు నవధాన్యాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గాలి మురళి నాయుడు మాట్లాడుతూ ఇది రైతుల ప్రభుత్వం అని గతంలో దివంగత నేత మాజీ మంత్రి వర్యులు గోపాలకృష్ణారెడ్డి హయాంలో ఎన్నో వరి కోత మిషన్లు, రైతు రథాలు, టార్ బాలిన్ పట్టలు, నాగేళ్లు, స్ప్రేయర్లు, ఎన్నో పనిముట్లు తొట్టంబేడు మండలంలో సబ్సిడీతో అధికంగా ఇచ్చిన ఘనత గోపాలకృష్ణారెడ్డి దక్కిందని వారి తనయుడు శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి రాష్ట్రంలోనే 9 డ్రోన్లు తొట్టంబేడు మండలానికి ఇచ్చిన ఘనత బొజ్జల సుధీర్ రెడ్డికి దక్కిందని, అదేవిధంగా వ్యవసాయ అధికారులు కూడా ఎప్పటికప్పుడు మండలంలో రైతులకు అందుబాటులో ఉంటున్నారని కొనియాడారు. అదేవిధంగా రైతులకు ఎంత మోతాదులో ఎరువులు కావాల్సిన , యూరియా కొరత ఎక్కువగా ఉన్నందున దానిని కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని మిల్లర్లకు లెవీ ఇవ్వనందున రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారని త్వరలోనే లెవికి గవర్నమెంట్ పర్మిషన్ ఇచ్చిన పంటలు వేస్తే గిట్టుబాటు ధర వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇలగనూరు మాజీ సర్పంచ్ మధు నాయుడు, వ్యవసాయ సహాయ అధికారులు పవన్, వినయ్ తుల్లా, రైతులు నాగూరు, కుమారస్వామి , సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక
Associate Editor: Tirumalasetty Koteswara Rao Volume: 1 Issue: 1

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143